

కేన్సర్ బాధితుల కోసం విగ్గులు



విగ్గులు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్ : హెల్పింగ్ మైండ్స్ అండ్ హోప్ ఫర్ లైఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ బాధితులకు మానసికంగా తోడుగా నిలవాలని దాతల నుంచి సేకరించిన కేశాలతో తయారు చేసిన విగ్గులను డిఎస్‌పి దర్బార్ కొండయ్య నాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో ముందు ఉండాలని తమ తమ పరిధిలో చదువుతో పాటు సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో కేన్సర్ బాధితుల కోసం 56 మంది కేశాలు దానం చేసి గొప్ప మనసుని చాటుకున్నారని పేర్కొన్నారు. వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. హోప్ ఫర్ లైఫ్ హిమజ సహకారంతో విగ్గులు అందుబాటులోకి వచ్చాయని, భాదితులకు ఉచితంగా విగ్గులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పురుషోత్తం, కిరణ్, అజిత్, షేక్ షా, ఆసీఫ్ పాల్గొన్నారు.

మైనింగ్ ఎగుమతులు పునరుద్ధరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎపిఎండిసి మైనింగ్ ఎగుమతులు పునరుద్ధరించి వేలాదిమంది కార్మికులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేట పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట మైనింగ్‌లో గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులను సస్పెండ్ చేసి తవ్వకాలు నిలిపివేశారని పేర్కొన్నారు. దీని వల్ల వేలాదిమంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారని తెలిపారు. మైనింగ్‌పై ఆధారపడి 800 మంది టిప్పర్ల డ్రైవర్లు, క్లీనర్లు, పెట్రోలు బంకులు, వెల్డింగ్ కార్మికులు, చిన్న చిన్న కిరాణా కొట్లు వారితో పాటు అనేకమంది పరోక్షంగా జీవిస్తున్నారని చెప్పారు. ఎగుమతులు నిలిపివేయడం వల్ల సుమారు 20వేల మంది కార్మికులు జీవనాధారం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఎగుమతులకు అనుమతించి పరిస్థితిని చక్కదిద్దాలని, లేనిపక్షంలో కార్మికుల తరపున ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, నరసింహ సర్వేపల్లి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ముస్లిములకు అన్యాయం జరగనివ్వం

మైనార్టీ శాఖ మంత్రి ఫారూఖ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వక్ఫ్ చట్టం విషయంలో ముస్లిమ్ మైర్టీలకు అన్యాయం జరుగ నివ్వమని మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.ఎం.డి ఫారూఖ్ ముస్లిములకు హామీ ఇచ్చారు. స్థానిక ఫంక్షన్‌హాలులో ఆదివారం ప్రొద్దుటూరు అంజుమన్ అహ్లెఇస్లాం ఆధ్వర్యంలో మంత్రి ఫారుఖ్‌కు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే వక్ఫ్ ఆస్తులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వక్ఫ్‌కు సంబంధించి 8లక్షల ఎకరాలు ఉన్నాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ముస్లిములకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ముస్లిములకు అన్యాయం జరిగిందని, ముస్లిం పేదప్రజలకు అందే పథకాలను రద్దు చేసి ఆర్థికంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పథకాలను పునరుద్ధరించడంతో పాటు వారిసంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. పూర్వీకులు మసీదులకిచ్చిన స్థలాన్ని ఎవరైనా కబ్జాలు చేస్తే సంహించేది లేదని వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడుతామని అన్నారు. అర్హతలేకున్నప్పటికీ జగన్ ప్రతిపక్ష హోదా కోరుకోవడం తగదని తెలిపారు. పులివెందుల ప్రాంత ప్రజలు జగన్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారని అసెంబ్లీకొచ్చి పులివెందుల ప్రాంత సమస్యలపై మాట్లాడి పరిష్కరించుకోవాలని హితవు పలికారు. 40 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నానని వక్ఫ్‌బోర్డుపై అవగాహన ఉందన్నారు. 1978లో బాగారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటు చేశామన్నారు. ముస్లి ములకు మంచి జరిగిందంటే తెలుగుదేశం హయాంలోనే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి పరిపాలన దక్షత కలిగిన వ్యక్తి అన్నారు. చంద్రబాబు హయాంలో కడపలో హజ్‌హౌస్ ఏర్పాటు చేశామని గత జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులొచ్చాయని తెలిపారు. హైదరాబాద్‌లోనూ హజ్‌హౌస్ తమ హయాంలో నిర్మించామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ విభజిత రాష్ట్రానికి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ప్రణాళికలున్నాయన్నారు. భూవివాదాల పరిష్కారం విషయంలో ఈ నెల 16 నుంచి కడపలో సీనియర్ కార్యదర్శి అందుబాటులో ఉంటారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముస్లిములకు వందశాతం మేలు జరుగుతుందన్నారు. ప్రొద్దుటూరులో కూరగాయల మార్కెట్‌లో గత పద్ధతులే ఉంటాయన్నారు. అవినీతి ఆస్కారం ఉండదన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీకి చెందిన మంత్రి డిప్యూటి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ముస్లిములకు చేసిన మంచి ఏమీలేదని విమర్శించారు. హజ్‌యాత్ర ముగించుకొని వచ్చి నెలరోజులు దాటిపోయిందని ఎన్నికల కోడ్ ముగిసినందున హజ్‌యాత్రికులకు ఇవ్వాల్సిన సబ్సిడీ మొత్తం మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో సుమారు 50 మంది వరకు హజ్‌యాత్రికులు ఈ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారని మంత్రికి విన్నవించారు. అనంతరం న్యాయవాదుల సంఘం,కూరగాయల మార్కెట్ సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో మంత్రిని, ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు, అంజుమన్ నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు



మాట్లాడుతున్న మైనార్టీశాఖ మంత్రి ఫారూఖ్

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ సుభాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. అబ్దుల్ సుభాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలస్తీనా పై దాడులు ఆపాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ డిమాండ్ చేశారు. ఆదివారం బాలాజీ నగర్‌లోని ఉపాధ్యాయ భవనంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఒ), ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలోఆవాజ్ అధ్యక్షులు పి.చాంద్ బాషా అధ్యక్షతన 'పాలస్తీనా సంఘీభావ సదస్సు' నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి (యుఎన్ఒ) గుర్తించిన సభ్య దేశమైన పాలస్తీనాలోని 90శాతం భూభాగాన్ని అమెరికా అండదండలతో, ఇజ్రాయిల్ ఆక్రమించేసిందని తెలిపారు. 39 లక్షల మంది పాలస్తీనియన్లను వారి మారునాయుధాలతో హత్య చేసిందన్నారు. స్థానిక పాలస్తీనీయన్లు వారి దేశ స్వాతంత్ర్యం కోసం, పోరాడుతున్నారని తెలిపారు. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్(పిఎల్ఓ.) అధ్యక్షులుగా 'అసర్ అరాఫత్', ఇజ్రాయిల్ ప్రధానిగా 'యాజాక్ రాబిన్'లు 1994లో శాంతి ఒప్పందం చేసుకొని పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండు ప్రజాస్వామ్య, లౌకిక దేశాలుగానూ మనుగడ కొనసాగించాలని నిర్ణయించుకున్నారన్నారు. అనంతరం 2006లో, 2017లో ఇరుదేశాల్లోనూ కూడా ఎన్నికలు యుఎన్ఓ పర్యవేక్షణలో జరిగాయని, నూతన ప్రజాస్వామ్య, లౌకిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య, లౌకిక సంస్థలు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి ఉద్యమి స్తున్నాయన్నారు. పశ్చిమ ఆసియా సామ్రా జ్యవాదాన్ని తరిమికొట్టడానికి ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా ముందుకు రావడానికి ఇది సరైన సమయం అన్నారు. పాలస్తీనా విముక్తి పోరాటానికి సంఘీభావంగా, లౌకిక, ప్రజాస్వామ్య పాలస్తీనా ఏర్పడాలని, వారి దీర్ఘకాలం జీవన్మరణ పోరాటం విజయం సాధించాలని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పాలస్తీనాను ఆక్రమిస్తున్న ఇజ్రాయిల్‌ను భారత్ ప్రభుత్వం బలపరచకూడదని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ జియోనిజం లాగా హిందూయిజాన్ని బిజెపి మార్చే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పార్లమెంటులో 'వక్ఫ్ బోర్డు సవరణ చట్టం బిల్లు" బిజెపి నరేంద్ర మోడీ ఎన్‌డి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానిని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, తర్వాత సబ్ కమిటీకి, రాజ్యసభకు, పంపించి నిపుణులచే సలహాలు, సూచనలు తీసుకున్నాక, సమగ్ర చట్టం తీసు కురావాల్సి ఉండగా, ఏకపక్షంగా సవరణలు చేయడం అనేక అనుమానాలకు దారితీ స్తోందన్నారు. దేశంలోని మైనార్టీ ప్రజల హక్కులు, భద్రత, భారత దేశ రాజ్యాంగం ఫెడరల్, లౌకిక వ్యవస్థ లక్ష్మన్నారు. దానికి భిన్నంగా బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తే దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమవుతుందని హితవు పలికారు. ముస్లిం జెఎసి నాయకులు బాబు బాయ్ మాట్లాడుతూ భారతదేశంలో 9 లక్షల 40వేల ఎకరాల వక్ఫ్ బోర్డ్ భూములు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలో నేవీ, రైల్వే తర్వాత పెద్ద సంఖ్యలో బోర్డు భూములు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో 70 వేల ఎకరాలు అందులో 32వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వోలామా అయ్యమ్మ కమిటీ మౌలానా అక్బర్ అలీ, జమియా ఉలామా కమిటీ ఎస్ నిజాముద్దీన్, ముస్లిం ఫెడరేషన్ ఎస్ నజీర్ హుస్సేన్, ఎంహెచ్పిఎస్ ఎస్ నాజర్ బాష, సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, న్యాయవాది యస్.మహమ్మద్ అలీ ఖాన్, ఎస్‌డిపిఐపి అలీ ఖాన్, విద్యాసాధన గ్రూప్స్ ఆఫ్ కళాశాలల రెస్పాండెంట్ పి. మన్సూర్ అలీఖాన్, జనతా మెడికల్ స్టోర్స్ ఎస్.రియాజ్, ప్రొఫెసర్ ఎస్.ఎం. ఫరూక్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బి.గురుమూర్తి, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, ఆవాజ్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, అన్వర్ బాష, మహబూబ్ బాషా, షరీఫ్ సదస్సు మాట్లాడారు.

రెండు నెలలైనా అందని బస్సు పాసులు

ఇబ్బందుల్లో గ్రామీణ విద్యార్థులు
ఆర్‌టిసి డిఎంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి ఏడాదీ విద్యాసంవత్సరం ప్రారంభం అవ్వగానే ఆర్‌టిసి డిపో మేనేజర్ ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గంతో పాటు రైల్వేకోడూరు లోని పాఠశాలలు, కళాశాలలకు ఆర్‌టిసి సిబ్బంది వెళ్లి విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. కానీ ఈ ఏడాది పాఠశాలలు పునః ప్రారంభమై రెండు మాసాలు పూర్తి కావుస్తున్నా రాజంపేట ఆర్‌టిసి డిపో మేనేజర్ రమణయ్య నిర్లక్ష్య వైఖరితో ఎక్కడా విద్యార్థులు బస్సు పాసులు అందించిన పాపాన పోలేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు పట్టణాలకు వెళ్లి చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో ఆర్‌టిసి డిపోకు వెళ్లి బస్సు పాసుల దరఖాస్తు, ఆన్‌లైన్ చేసుకోవాలనే అవగాహన లేకపోవడంతో ఉసూరుమని వెనుదిరిగి మళ్లీ మళ్లీ డిపో వైపు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు కూలీ పనులు మానుకొని డిపోవైపు అన్నిసార్లు తిరిగి ఆర్థికంగాను అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు తరగతులు వదులుకొని బస్సు పాసుల కోసం డిపో వైపు పరుగులు పెడుతున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఆర్‌టిసి సిబ్బంది పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి పాసులు అందజేశారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వంలోనూ అదే విధంగా ఇస్తే విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు బస్సుపాసులు ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

గ్రామీణ ప్రాంతాల నుంచి అనేకమంది విద్యార్థులు పట్టణ, మండల కేంద్రాలకు వెళ్లి చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్సు పాసుల సౌకర్యం కల్పించిందని, కానీ రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నేటికీ బస్సు పాసులు మంజూరు చేయకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. గతంలో ఆర్‌టిసి సిబ్బంది ప్రతి మండలానికి విద్యార్థుల డేటా తీసుకొని పాసులు అందించేవారని, విద్యార్థులను పాసుల కోసం డిపోకు రప్పించుకోవడం వల్ల వారి తరగతులకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.విద్యార్థుల సౌకర్యార్థం వెంటనే బస్సు పాసులు అందించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ముందస్తు స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా సోమవారం నుంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై ఆదివారం స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు వివిధ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణమంతా స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, బ్యానర్లతో నిండిపోవాలన్నారు. మిగతా బ్యానర్లను తొలగించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ మదనపల్లెలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల గురించే మాట్లాడుకునేలా అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలియజేశారు. ఒక్కో పనిని ఒక్కొక్కరికి అప్పగించారు. మదనపల్లె చరిత్రను దశ దిశలా వ్యాపింప చేసేలా వేడుకలు ఉండాలన్నారు. వేడుకల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఎస్‌పి కొండయ్యనాయుడు, మున్సిపల్ చైర్మన్ ప్రమీల, ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి, జ్ఞానాంభిక కాలేజ్ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, విజయభారతి సేతు, అపుస్మా నాయకులు, బాస్ నేత పిటియం శివప్రసాద్, పోర్డు లలితమ్మ, ప్రజాకవి పోతుబోలు రెడ్డెప్ప, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సర్దుబాటుకు ముందే ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ఎన్‌టిఎ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ముందే ఉద్యోగోన్నతలు చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డైట్ కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగానూ, స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులు గానూ ఉద్యోగోన్నతలు కల్పించిన తర్వాతనే పని సర్దుబాటు చేయడం మంచిదని ఆయన అన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో తాత్కాలిక నియామకాల ద్వారా కాకుండా శాశ్వత ప్రాతి పదికన జూనియర్ లెక్చరర్ ఉద్యోగోన్నతలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్ 117 ప్రకారం పని సర్దుబాటు చేయడంలో చాలా లోపాలు ఉన్నాయని, దాన్ని సవరించిన తర్వాతనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన తప్పిదాలను తిరిగి పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులు మనోవేదనకు గురికాకుండా ఉపాధ్యాయ సంఘం నాయకులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ తమ సర్వీస్‌ను 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు తీసివేసి వారి స్థానంలో మహిళా వార్డెన్‌లను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజలు, శ్రీనివాసులు, మురళీమోహన్ రాజు, కులశేఖర్ రెడ్డి, నరేంద్ర కుమార్ రెడ్డి, ఆసిఫ్,నాగరాజు నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌టిఎ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా కరీం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేట అధ్యక్షులుగా ఎస్.ఎం.డి కరీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాజంపేటలో అసోసియేషన్ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎస్.జి ఈనాయ తుల్లా, ఉపాధ్యక్షులుగా ఆర్.కే.ఎస్ ఆదిల్, పి.ఆరిఫ్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సైజాన్, సహాయ కార్యదర్శుగా సయ్యద్ మసూద్, షేక్ మతిన్, కోశాధికారిగా షేక్ నిసర్, కార్యవర్గ సభ్యులుగా షేక్ షాహిద్, సయ్యద్ సలీంను ఎన్నుకున్నారు. ఎన్నికైనవారిని ముస్లిం పెద్దలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు కరీం మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.

పైళ్ల దగ్ధం కేసులో నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో చోటు చేసుకున్న పైల్స్ దగ్ధం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన పైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించినప్పటికి, డిజిపి సిఐడి చీఫ్, రెవెన్యూ ప్రధాన కార్యదర్శి సిసోడియ వచ్చినా ఇప్పటివరకు నిప్పు పెట్టిన నిందితులను పట్టుకొలేదన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం న్యాయం చేస్తుందని నమ్మి పిర్యాదులు చేసుకున్న రైతుల పరిస్థితి ఏమిటన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు వెలికి తీసి పెద్ద రైతులకు న్యాయం చేస్తారనుకుంటే కబ్జాదారులతో చేయి కలిపి ప్రస్తుత ప్రభుత్వం వాటా కోసం ఈ కేసును ఆలస్యం చేస్తున్నారని అనుమానం వ్యక్తమవుతోందన్నారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయకపోతే సిపిఐ బాధితుల తరపున పోరాటం చేస్తామని చెప్పారు. అందులో భాగంగానే సోమవారం జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల వద్ద భూబాధితులతో కలిసి ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ధర్నా కార్యక్రమానికి భూబాధితులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలోసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, నియోజక వర్గం కార్యదర్శి కె మురళి, రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎసిఎ క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్ -19 గ్రూప్ -బి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుకు చెందిన పరం వీర్‌సింగ్ డబల్ సెంచరీ చేయడంతో ఆ జట్టు మొదటి ఇన్నింగ్ లో 697 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఐదు వికెట్ల నష్టానికి 381 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు 158.2 ఓవర్లలో 697 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని పరం వీర్ సింగ్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించి డబల్ సెంచరీ చేశాడు. 361 బంతులను ఎదుర్కొని 19 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 208 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. మరో బ్యాట్స్ మెన్ కె. ఏ. ఎస్. ప్రసాద్ 112 పరుగులు(నాటౌట్), బి. యశ్వంత్ 132 పరు గులు (సెంచరీ)చేశాడు. నెల్లూరు జట్టులోని ఎస్. భార్గవ్ మహేష్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 49 ఓవర్లు వేసి అందులో ఆరు ఓవర్లు మేడిన్ చేసి 194 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకోవడం విశేషం. బాసిత్ బాబు రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 11.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 31 పరు గులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ లో విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో అధికత సాధించింది. వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా జట్టుకు చెందిన వరుణ్ సాత్విక్ డబల్ సెంచరీ చేయడంతో ఆ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 573 పరుగుల భారీ స్కోరు సాధించింది. కృష్ణా, కడప జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో కడప జట్టు 259 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 335 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 176.2 ఓవర్లలో 573 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి డబల్ సెంచరీ చేశాడు. 320 బంతులను ఎదుర్కొని 30 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 214 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 21.0 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 91 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో వెస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి జట్టు 231 పరుగులు చేసింది. శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 66 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారం భించిన వెస్ట్ గోదావరి జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 72.0 ఓవర్లలో 238 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఆట ముగిసే సమయానికి 42.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు
లెజెండరీ పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, మదర్ థెరిసా, కోడి రామకృష్ణ లెజెండరీ పురస్కారాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు అందుకున్నారు. ఆదివారం వారు పీలేరులో మాట్లాడుతూ శనివారం అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్ర భారతిలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారన్నారు. కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్ కృష్ణ మోహన్, సినీనటి ఫైజా జాన్, సినీ హీరో నరేందర్, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ, ఇతర అతిథులు హాజరయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా అతిథుల నుంచి పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక, సినీరంగ కళాకారుడు ఖాదర్ బాష షేక్ ఎన్టీఆర్ లెజెండరీ పురస్కారం, అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారాన్ని స్క్రిప్ట్ రైటర్ షేక్ గౌస్ బాష, పద్య కవి జలకనూరి మురళీధర్ రాజు, తిరుపతికి చెందిన ఏఎస్ఐ దిగళ ప్రసాద్ రాజు, అలాగే కోడి రామకృష్ణ లెజెండరీ పురస్కారాన్ని మాస్ కమ్యూనికేటర్, ఫైన్ ఆర్ట్స్ కమ్యూనికేటర్ డాక్టర్ తుంగ యోగేష్ బాబు, మదర్ థెరిసా లెజెండరీ పురస్కారాన్ని ఆంగ్ల భాష బోధకురాలు కె. విజిత యోగేష్, యాదమర్రి పి.హెచ్.పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ. లక్ష్మీ నారాయణ, తిరుపతికి చెందిన నిర్మల్ చిత్ర కారిణి బత్తుల అర్చన, రాజీవ్ గాంధీ లెజెండరీ పురస్కారాన్ని వై. షామీర్ అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు ఇలాంటి ఉత్తమ పురస్కారాలు అందడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.



లెజెండరీ పురస్కారాలు అందుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీకాంత్ ప్రతిభ

- అంతర్జాతీయ పోటీలకు ఎంపిక
- పోటీలో పాల్గొనేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురు చూపు

ప్రజాశక్తి - కడప అర్బన్

నిరుపేద కుటుంబాలలో వారి పిల్లలను చదివించడం కష్టమైన ఈ తరుణంలో విద్యతో పాటు క్రీడలలోనూ ముందుకు వెళ్లాలంటే ఆ క్రీడాకారులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. క్రీడలలో నిరుపేద విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో వారు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న అంశం. తల్లి దండ్రులు బిడ్డలను క్రీడలకు పంపడానికి ఆనందంగా ఉన్నప్పటికీ వారి ఆర్థిక స్థోమత లేక క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. కడప జిల్లా, పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన ఎ.శ్రీనివాసులు ఎ. గంగ రాణి కుమారుడు .శ్రీకాంత్ వాల్ బాల్ క్రీడారంగంలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. గత నెల 26 ,27, 28 తేదీలలో రాజస్థాన్లో నోహన్ మండలం హనుమగర్ జిల్లాలో నిర్వహించిన వాలీ బాల్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. రాజస్థాన్ వెళ్లి మంచి ప్రతిభ కనపరిచి అండర్-18 బాలుర విభాగంలో బంగారు పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. వాలీ బాల్ అంతర్జాతీయ స్థాయి పోటీలు నేపాల్ దేశంలోని ఫోఖ్రా పట్టణంలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే పోటీలలో శ్రీకాంత్ ఎంపికైనట్లు ఇండియన్ వాలీ బాల్ అధ్యక్షులు ఆశిష్, ప్రధానకార్యదర్శి కుమార్ సింగ్ గౌరీ తెలిపారు. ఇతని ఎంపిక పట్ల ఆంధ్రప్రదేశ్ వాలీ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రంభ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా అభినందించారు. శ్రీకాంత్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి తమ వంతు ఆర్థికంగా ఆదుకోవాలని కడప జిల్లా వాలీ బాల్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రసాద్ కోరుతున్నారు. దాతలు 8121884514లో సంప్రదించి ఆర్థిక సాయం చేయాలని కోరారు.



శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

సర్పంచులకు, కార్యదర్శికు మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యంపిడి వరుకురం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఓ వి.వి.పరుశురాం పేర్కొన్నారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలమేరకు సర్పంచులకు, కార్యదర్శులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మి కంపోస్ట్ తయారీ, పంచాయతీ అభివృద్ధి కి సంబంధించిన ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు మండలములోని 14 గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు. **గాలివీడు** : స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి శేఖర్ నాయక్ పేర్కొన్నారు. ఈనెల 14 వరకు కార్యక్రమం కడప కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వారి ఆదేశానుసారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ వారు గ్రేడ్ వన్ నుంచి ఐదు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో గ్రామపంచాయతీ విధులు బాధ్యతలు , పంచాయతీరాజ్ చట్టం 1994, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహణ, వీధి దీపాల మీద శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలోని 17 గ్రామాలలో ఉన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

పుల్లంపేట: పుల్లంపేట ఎస్ఐగా జె.మోహన్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. రాజంపేట అర్బన్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అక్కడి నుంచి పుల్లంపేట స్టేషన్‌కు బదిలీ అయినట్లు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రఘురాంరెడ్డి కర్నూల్ విఆర్‌కు బదిలీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు. కోడి పందేలు, పేకాట జరగకుండా అడ్డు కట్ట వేస్తామని తెలిపారు. గంజాయి ఎక్కడ అయినా కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుకపాదం మోపు తామన్నారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ఎటువంటి సహాయం కావాలన్నా ప్రజలకు ఎల్ల వేళా అందుబాటులో ఉంటానని తెలిపారు.


మోహన్ కుమార్ గౌడ్

పుల్లంపేట/ఓబులవారిపల్లి: ఓబులవారిపల్లి మండల ఎస్ఐగా ఆదివారం మహేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో దిశ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఓబులవారిపల్లి ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న చిన్న పెద్దయ్యను చాపాడు ఎస్ఐగా బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో నాటుసారా, పేకాట, గంజాయి, మట్కా, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘాఉంచుతానని, మండల ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని కోరారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మహేష్

బి.కొత్తకోట/పిటిఎం : పెద్దతిప్పసముద్రం నూతన ఎస్ఐగా నరసింహుడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీలేరు ఎస్ఐగా విధులు నిర్వ హిస్తూ బదిలీల ప్రక్రియలో భాగంగా పెద్దతిప్పసముద్రం ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకి నిరంతరం అందు బాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్ పదానికి అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకు పోలీసుసిబ్బంది, ఇతర శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. **సుండుపల్లె :** సుండుపల్లి ఎస్ఐగా హుస్సేన్ నియమితులైనట్లు స్థానిక ఎస్ఐ రమణ తెలిపారు. గతంలో ఎన్నికల్లో బదిలీపై వచ్చిన ఎస్ఐ ఎం.హుస్సేన్ కడప టూ టౌన్‌కు బదిలీ అవడంతో ఆయన స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన శ్రీనివాసులను కొండపల్లి మండలానికి ఎస్ఐగా నియమితులైనట్లు ఆయన తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహుడు

గాలివీడు: గాలివీడు ఎస్ఐగా పి రామకృష్ణ బాధ్యతలు తీసుకున్నారు. సంబేపల్లి ఎస్ఐగా పనిచేసే అక్కడి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వెంకటప్రసాద్ అన్నమయ్య జిల్లా విఆర్‌లో ఉన్నారు. సంధ్యాల నుంచి ఎన్నికల విధులు పై గాలివీడుకి వచ్చిన ఎస్ఐ వెంకటప్రసాద్ ప్రజలందరికి అందుబాటులో ఉండి ప్రజాస్వామ్యంగా రక్షించే విధంగా ఉండి చట్టాన్ని న్యాయాన్ని కాపాడుతూ ప్రజలందరికి సేవ చేస్తూ వచ్చారు.

పీలేరు: పీలేరు అర్బన్ ఎస్ఐగా బి.బాలకృష్ణ నాయుడు బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లి వన్ టౌన్ ఎస్ఐగా ఉన్న ఆయన బదిలీపై ఆదివారం పీలేరుకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహుడు పిటిఎం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. లా అండ్ ఆర్డర్ నియంత్రించడానికి తన సిబ్బందితో కలిసి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎస్ఐకి తన సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి పీలేరు పట్టణ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.

కలికిరి సిఐగా రెడ్డిశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి నూతన సిఐగా రెడ్డిశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్.మోహన్ ఎస్పీ కార్యాలయం విఆర్‌కు బదిలీ అయ్యారు. తిరు మలలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రెడ్డిశేఖర్‌రెడ్డి బదిలీపై కలికిరికి వచ్చినట్లు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఇందుకు పోలీసు సిబ్బంది, ప్రజ లు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.


సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి

సుండుపల్లి ఎస్ఐ బదిలీ వద్దు

ప్రజాశక్తి-సుండుపల్లె

సుండుపల్లి ఎస్ఐ ఎస్‌కెఎం హుస్సేన్ బదిలీపై మండల ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే ఎన్నడూ లేని విధంగా ఎంతో మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. మండలంలో రౌడీ షీటర్ల ఆగడాలని అణిచి వేసి ప్రజలకు భరోసా నింపారని తెలిపారు. ప్రతి యేడాది నిర్వహించే ఉత్స వాలు, జాతర్లలో ఘర్షణలు జరిగేవని ఈ యేడాది ఎలాంటి ఘర్షణలు జరగకుండా చాకచక్యంగా వ్యవ హరించారని తెలిపారు. పోలీస్ స్టేషన్ వెళ్లే బాధితుల సమస్యలను తక్షణమే స్పందించి న్యాయం చేసేవారని అన్నారు. ఎస్ఐ హుస్సేన్‌ను బదిలీ రద్దు చేసి ఇక్కడే విధుల నిర్వహించేలా చూడాలని ఎస్పీని కోరారు.



ఎస్ఐ ఎస్‌కెఎం హుస్సేన్

తంబళ్లపల్లెలో డెంగీ కలకలం

-మూడు కేసులు నమోదు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లిలో డెంగీ కలకలం రేపుతోంది. ఆదివారం తంబళ్లపల్లి మండల కేంద్రంలో ముగ్గురు బాలికలకు డెంగీ జ్వరం నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తుంది. మండల కేంద్రానికి చెందిన రక్షిత(10), రెడ్డి కీర్తన(9), సిద్ధారెడ్డిగారిపల్లెకు చెందిన కవిత(14)లు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు వీరికి జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు చికిత్స కోసం తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వీరికి డెంగీ అనుమానిత లక్షణాలు ఉండడంతో రాపిడ్ పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి వెంకట్రామయ్య తెలిపారు. అప్రమత్తమైన వైద్యాధికారి వెంటనే ఇద్దరు బాలికలను రక్షిత కవితలను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని వైద్య చికిత్సలు అందిస్తుండగా మరో బాలిక రెడ్డి మేఘన ఇంటి వద్ద ఉంటూ చికిత్సలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం మరో మారు డెంగీ నిర్ధారణ కోసం రక్త నమూనాలను మదనపల్లి జిల్లా వైద్యశాల ల్యాబ్‌కు పంపగా డెంగీ నిర్ధారణ అయినట్లు వైద్యాధికారి తెలిపారు. దీంతో రక్షిత కవితలను మెరుగైన వైద్య చికిత్సల కోసం మదనపల్లి జిల్లా వైద్య శాఖకు రిఫర్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ముగ్గురు బాలికల ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఎవరైనా రెండు రోజులకు మించి జ్వరం వచ్చినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలనే వైద్య అధికారి కోరారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా దోమలు విజృంభిస్తున్న అరికట్టడంలో అధికారులు వైఫల్యం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అధికారులు సమావేశంలో సూచించడం మే తప్ప క్షేత్రస్థాయిలో ఉన్నత పరిస్థితులను పర్యవేక్షించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దోమల నివారణకు మరుగునీటి కాలువల వెంట మందు, పిచికారి, ఆయిల్ బాల్స్ వేయడం . తదితర చర్యలు చేపట్టిన పాపాన పోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు

వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం

డెంగ్యూ ప్రబల్లినట్లు సమాచారం అందుతూనే అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాం. లక్షణాలున్న వారికి టెస్టులు చేసే అవసరమైన మందులు అందిస్తున్నాం. వైద్య సిబ్బంది గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాలపై అప్రమత్తం చేస్తున్నాం. ఇళ్ల వద్ద పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ అవగాహన కల్పిస్తున్నాం. డెంగీ బాధితులను ఎప్పటికప్పుడు పరవేక్షిస్తున్నాం. ప్రస్తుతం వీరి ముగ్గురి ఆరోగ్యం నిలకడగానే ఉంది.

-డాక్టర్ మునికుమార్, కోసవారిపల్లె పిహెచ్‌సి

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరామాలయంలో రెండు రోజులుగా పట్టాభిషేక హోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ మొదలై ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మండపాన్ని విశేష అలంకరణలతో వేదికను తీర్చి సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను అధిష్టింపజేసి మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ పట్టాభి రాముడికి కిరీట ధారణ గావించి, పట్టాభిషేక మహోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. సాయంత్రం ఉంజల్ సేవ, రాత్రికి విశేషాలంకృతుడైన పట్టాభి రాముడిని గరుడ వాహనంపై పురవీధులలో విహరించారు. ఈ కార్యక్రమాలలో టిటిడి అధికారులు, ఆగమ పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో రద్దు చేసిన భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి, నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషాలు డిమాండ్ చేశారు.ఆదివారం పట్టణంలో తాపీ మేస్త్రీలు, కూలీల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2006 సంవత్సరంలో సంక్షేమబోర్డు ప్రారంభమై 2019 తరువాత గత ప్రభుత్వం సంక్షేమ బోర్డులు నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. కూటమి తరపున మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని పెట్టడం జరిగినందున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లేబర్ డిపార్టుమెంటులో సంక్షేమ కార్డులు పొందిన 22 లక్షల మంది కార్మికులే కాకుండా కార్డులు పొందని కార్మికులు సుమారు 30 లక్షల మంది వెరసి 50 లక్షల మంది ఉన్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లైములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, రఘు నాథ్, మురళి, మేస్త్రిలు రామాంజులు, శంకర్, నరసింహులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కౌన్సిలర్ ఆరా

ప్రజాశక్తి-రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీలోని 20వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ డాక్టర్ పి.మదనమోహన్ పర్య టించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై ఆరా తీశారు. ముస్తఫా మసీదు వద్ద తాగునీటి బోరు మరమ్మత్తులకు గురి కావడంతో ఆస్థానంలో నూతన మోటారును ఆయన ఏర్పాటు చేయించడపై ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. సింగపూర్ లైన్, ఎన్‌జిఒకాలనీ, ఎస్‌వి.విద్యామందిర్ స్కూల్ తదితర ప్రాంతాలలో డ్రెయినేజీ, నూతన రోడ్ల నిర్మాణాలను మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి సహకారంతో చేపడతామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. ఐదు వార్డుల నుంచి ఈ ప్రాంతంలోకి వర్షపు నీరు చేరడంతో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను బాగుచేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, రెడ్డె య్య, మహేష్, రఘు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలో అగ్రహారం నుంచి పెద్దబలిజపల్లికి వెళ్లే రోడ్డుకు ఆదివారం టిడిపి నాయకులు శివరాం నాయుడు, కూటమి నాయకులు జగదీష్‌స్వామి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడా ఈ రోడ్డు గుంతల మయంగా ఉండటంతో వాహనదారులు ఆ దారిన వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడే వారని అన్నారు. రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం దృష్టికి తీసుకురాగా ఆయన ఆదేశాల మేరకు మరమ్మతులు చేయమని చెప్పడంతో జెసిబితో సహాయంతో రోడ్డు మరమ్మతులు చేయించామని చెప్పారు. ఈ విషయాన్ని గతంలో ఎంపిడిఒ దృష్టికి కూడా తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేదని, పంచాయతీ సెక్రెటరీ సురేష్ బాబు కూడా ఈ విషయం తెలిసినా కూడా స్పందించ లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ రోడ్డు ద్వారా దళితవాడ, ఏటిరాశిపల్లె, గుట్టకాడ బలిజపల్లి వెళుతుందని తెలిపారు.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న జెసిబి

శివనగర్‌లో పెట్రేగుతున్న దొంగలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణ శివారులోని శివనగర్‌లో ఇటీవల దొంగలు పెట్రేగి ఇళ్లల్లోకి చొరబడుతున్నారని స్థానికంగా నివసిస్తున్న నరసింహులు, శివశంకర్ రెడ్డిలు ఆదివారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మా ఇళు ఊరి చివరిన ఉండడంతో దొంగలు మాఇళ్ళనే ఎంచుకొని ముసుగులు ధరించి చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ముసుగు దొంగలు ఇంట్లోకి చొరబడి తిరిగి వెళ్ళిపోయిన దృశ్యాలు సీసీ కెమరాలో రికార్డు కావడంతో ఆ పుటేజీని ఫిర్యాదుకు జతపరచారు. కావున పోలీసులు తమ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించి చోరీలు జరగకుండా అరికట్టాలని వారు కోరారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈ నెల 15 నుంచి వచ్చే నెల 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 22ఎ భూముల అక్రమాలతోపాటు రెవెన్యూ సమస్యలపై అర్జీల స్వీకరణ ,ప్రతి గ్రామానికి తహశీల్దార్, ఏడుగురు అధికారులు నియమించింది. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్ లైన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు సూచించారు.

రామాపురం తహశీల్దార్‌గా రామాంజనేయులు

ప్రజాశక్తి-రామాపురం

రామాపురం మండల తహశీల్దార్‌గా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు అనంతపురం జిల్లా బదిలీపై వెళ్లడంతో రామాపురంకు రాయచోటి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూన్న రామాంజనేయులు ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చే వెంటనే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, విఆర్ఒలు నరసింహులు, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, విగ్నేష్, ప్రేమ సాగర్, హేమలత, ఈశ్వరయ్య, అజీజ్‌వుల్లా పాల్గొన్నారు.

రాయితీ గడ్డి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి : ప్రభుత్వం అందించే రాయితీ గడ్డి విత్తనాలు పశు పోషకులు దీనిని ఏం చేసుకో వెటర్నరీ ఎడి విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 800 కేజీలు మంజూరు అయినవి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ గడ్డి విత్తనాలు 75శాతం రాయితీతో రైతు సేవ కేంద్రంలో ఉన్నవి అన్నారు. అసలు పశుగ్రాస కొరత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

నేడు మహల్‌లో ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మహల్‌లో సోమవారం సాయంత్రం హజరత్ సయ్యద్‌షా మహమూద్‌బాషా బుఖారి ఖాదరి షహమీరి సాహెబ్ వారి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆస్థాన పీఠాధిపతి వర్గ సభ్యులు డాక్టర్ మొహమ్మద్ రియాజ్ బాషా బుఖారీ సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం ఖురాన్ గ్రంథ పారాయణం, భక్తి గీతాలాపన, రాత్రి గురువు సమాధిపై చాదర్ సమర్పించి ఫాతిహా ప్రార్థనలు జరుగుతాయని వివరించారు. రాత్రి ధార్మిక ఉపన్యాసాలు ఉంటాయని, ఈ ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ మత గురువులు, భక్తులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో స్థానిక ప్రజలు కూడా పాల్గొనాలని కోరారు.

'మానవత' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందియమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లిలోని నలంద హైస్కూల్ లో జరిగిన మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 115 మండలాల్లో మానవత స్వచ్ఛంధ సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేస్తుండడంతో పాటు ప్రతి మండలంలో పేద ప్రజలకు అందుబాటులో బాడీఫ్రిజర్ బాక్స్,శాంతి రథాలు అనేక సేవా కార్యక్రమాలు ఉచితంగా చేస్తున్నారన్నారు. అధ్యక్షులు రమణారావు, చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి మునిరాజా తెలిపారు. గ్రామంలో దోమలు అధికంగా ఉండడంతో ప్రజలు విష జ్వరాలు బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా దోమల నివారణకు చర్యలు చెబుతున్నట్లు తెలిపారు. పంచాయితీలో ఉన్న మురికినీటి కాలువలు, చెత్తాచెదారం శుభ్రం చేయించినట్లు తెలిపారు.దోమల నివారణలో భాగంగా ఫాగింగ్ చేయించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సూచనలు సలహాలు ఇస్తూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, వేపాకు వేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. దోమలు అధికంగా వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోనఎంపిటిసి కుమారి, మాజీ ఎంపిటిసి చంద్రమోహన్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, త్యాగరాజు, పంచాయతీ సిబ్బంది జిలాని పాల్గొన్నారు.


దోమల నివారణకు పాగింగ్ చేస్తున్న సిబ్బంది


యల్లటూరును సన్మానిస్తున్న ఆర్‌టిసి కార్మిక సంఘం నాయకులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి :'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆర్‌టి సిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం యల్లటూరు భవన్‌లో శ్రీనివాసరాజును కలిసి వినతిపత్రం అందిం చారు. ఈసందర్భంగా గంగాంజనేయులు మాట్లా డుతూ ఆర్‌టిసిలో కాంట్రాక్టు విధానంలో సుమారుగా 7,300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నారని, థర్డ్‌పార్టీ విధానం వల్ల చాలా నష్టపోతున్నామని తెలిపారు. ఆర్‌టిసిలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా సంస్థ నుంచి వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన అప్కాస్‌లో ఆర్‌టిసి కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. బీమా ఆర్‌టిసి ద్వారా చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఆర్‌టిసి కార్మికుల సమస్యలను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, జోనల్ వర్క్ షాప్ అధ్యక్షులు సురేష్, రాజంపేట డిపో అధ్యక్షులు కుమార్, డిపో కమిటీ సభ్యులు గోపి, ప్రసాద్, పెంచలయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.


విరాళాన్ని అందిస్తున్న దాతలు

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థాన ఆలయ అభివృద్ధి పనులకు కొత్తకోట మండలం, బడికాయలపల్లికి చెందిన డాక్టం మానేరి వెంకటరమణ రూ.50,116లు, బెంగుళూరుకు చెందిన వెంకట కిరణ్ కుమార్ రూ.25,116లు నగదును విరాళంగా అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతలను సన్మానించారు. ఈమొత్తాన్ని ఇండియన్ బ్యాంకు వాయల్పాడులో ఆలయ ఖాతాకు జమ చేస్తామని ఆలయ ఇఒ మంజరుల తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డ ఓ యువకుడు 29ఏళ్లకే దాదాపు రూ.25 లక్షలు అప్పులు చేసి ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం అర్థరాత్రి వాల్మీకిపురం పట్టణ పొలిమేర సమీపంలో చోటు చేసుకొంది. రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లి పట్టణం అమ్మినేనివీధికి చెందిన వెంకట్‌రాజు, సరస్వతి దంపతుల కుమారుడు పి.అమర్‌తేజ(29) బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేసేవాడని తెలిపారు. గత కొద్దిరోజులుగా అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తీసుకురావడంతో తనలో తానే కుంగిపోయిన అమర్‌తేజ మానసిక శోభ అనుభవించేవాడని తెలిపారు. గత రెండు నెలలుగా తీవ్ర ఒత్తిడి రావడంతో శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వాల్మీకిపురం పొలిమేరలోని రైల్వేలైన్ వద్దకు వచ్చి తిరుపతి నుంచి గుంతకల్‌కు వెళ్తున్న రైలుకింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శరీర భాగాలు విడివిడిగా పడిపోయాయి. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతికి గల కారణాలపై మృతుడి తల్లి, స్నేహి తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పి.అమర్‌తేజ(ఫైల్ ఫొటో)

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-కలకడ : వ్యక్తిపై అత్యాయత్నం జరిగిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుడి బంధువులు, స్థానికుల వివరాల మేరకు..మండలంలోని రాజీవ్ నగర్ కాలనీలో నవాజ్(24) తన భార్య పిల్లలతో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం భార్య భర్తలు గొడవ పడ్డట్లు స్థానికులు తెలిపారు.ఈ నేపథ్యంలో భార్య నౌషిన్‌ను భర్త నమాజ్ మందలించి ఘర్షణ పడ్డట్లు తెలిపారు. భర్తపై భార్య కడపలో ఉన్న తన బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. చెల్లెలిపై మమకారంతో ఉన్న అన్న షాహినూర్, కొంతమంది కలిసి కలకడ రాజీవ్‌నగర్ కాలనీ వచ్చి నవాజ్‌పై దాడి చేసినట్లు తెలిపారు. చెల్లెలను కొట్టాడన్న ఆవేశంతో షాహినూర్ పిడిబాకుతో నవాజ్ పొట్టపై పొడిచినట్లు తెలిపారు. గాయపడిన నవాజ్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, వైద్య సేవ నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా వైద్యశాల తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై సిఐ శ్రీనివాసులు ఆదేశాను సారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

8 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... ఆదివారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి సమీ పంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ మేరకు స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,800లు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది శివరామకృష్ణ, శివ, సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం : చిన్నమండెం-రాయచోటి జాతీయ రహదారిపై బాపూజీ నగర్ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరు గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి నుంచి రాయచోటి వైపు టమోటా లోడు తోవస్తున్న ఐచర్ వాహనం ముందు వెళుతున్న ఆటోను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసు కుంది.లక్కిరెడ్డిపల్లి మండలం దక్షిణ మిట్ట దళితవాడకు చెందిన గంగులయ్య, ఓబయ్య, చంద్ర, రమణయ్య, ఎల్.ఓబయ్య, వై.ఓబయ్యలుగా గుర్తించినట్లు తెలిపారు. బోరెడ్డిగారిపల్లె వద్ద లగ్నపత్రిక రాసు కొని తిరుగు ప్రయాణంలో ప్రమాద బారి నపడినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో అంబులెన్స్ లభించక గాయపడిన వారిని ఆటోలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో గంగులయ్య అనే వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.